# చౌక బియ్యం ఆలస్యం


బియ్యం లేకపోవడంతో తెరుచుకోని ఖమ్మం అర్బన్ ఎంఎల్ఎస్ గోడౌన్

రేషన్ కార్డుదారులకు సంక్రాంతి నుంచి సన్నబియ్యమంటూ ఒకసారి, ఉగాది నుంచి సన్నబియ్యమంటూ మరోసారి, లేదులేదు ఫలానా రోజు నుంచి అంటూ ఇంకోసారి రాష్ట్ర మంత్రులు ప్రకటనలమీద ప్రకటనలు గుప్పించారు. గత నవంబర్‌లో మొదలైన ఈ ప్రకటనలు, ఉన్నతాధికారుల మాటలు నేటికీ అంతులేని కథలా కొనసాగుతూనే ఉన్నాయి. కానీ కార్డుదారులు మాత్రం ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. 'సన్నబియ్యం సంగతి కాదు.. ముందు ఉన్న బియ్యాన్ని సమయానికి ఇవ్వండి' అంటూ డిమాండ్ చేస్తున్నారు. సన్నబియ్యం ప్రకటనలను ముందుపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. రేషన్ కార్డుదారులకు ప్రతి నెలా అందజేసే రేషన్ బియ్యాన్ని ఇంత వరకూ చౌక దుకాణాలను సరఫరా చేయలేదు. ఖమ్మం జిల్లాకు చేరాల్సిన కోటా ఇప్పటికీ చేరనేలేదు. మండలస్థాయి గోడౌన్లలో బియ్యం లేకపోవడంతో బియ్యం సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. మూడు నెలలుగా ఇదే తంతు జరుగుతున్నా, కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నా, డీలర్లు సమస్యలను ఎదుర్కొంటున్నా.. ప్రభుత్వం మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ప్రతి నెలా 1వ తేదీనే పంపాల్సిన బియ్యాన్ని 7వ తేదీ వచ్చినా సరఫరా చేయలేదు. అసలు చౌక ధరల దుకాణాలకే బియ్యం రాకపోవడంతో రేషన్ డీలర్లు కూడా చేతులెత్తుతున్నారు. –ఖమ్మం, మార్చి 6

- గోడౌన్లలో నిల్వలు నిల్.. పంపిణీ ప్రొలాంగ్..
- రేషన్ షాపులకు ఇంకా చేరని 'చౌక బియ్యం'
- ఇబ్బందులు పడుతున్న కార్డుదారులు
- ముందస్తు ప్రణాళిక లేని కాంగ్రెస్ పాలకులు
- ఖమ్మం జిల్లాలో మూడు నెలలుగా ఇదే తంతు
- జిల్లాకు రావాల్సింది 6,434 మెట్రిక్ టన్నులు
- ఇప్పటికి చేరింది కేవలం 500 టన్నులే..


బియ్యం రాకపోవడంతో తెరుచుకోని రేషన్ దుకాణం

ఖమ్మం జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీకి 8 మండలస్థాయి గోడౌన్లు ఉన్నాయి. ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, నేలకొండపల్లి, వైరా, మధిర, సత్తుపల్లి, ఏన్కూరు, కల్లూరుల్లోని ఈ స్టాక్ పాయింట్ల నుంచి ప్రతి నెలా జిల్లాలో ఉన్న 748 రేషన్ షాపులకు బియ్యం సరఫరా అవుతాయి. షాపులకు వచ్చిన వెంటనే కార్డుదారులకు డీలర్లు పంపిణీ చేస్తారు. సాధారణంగా ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు బియ్యం పంపిణీ జరుగుతుంది. 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మండలస్థాయి స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం సరఫరా కావాలి. కానీ గడిచిన మూడు నెలలుగా ఈ సరఫరాలో జాప్యం జరుగుతున్నది. ఫలితంగా బియ్యం పంపిణీ ఆలస్యమవుతున్నది. తద్వారా కార్డుదారులకు ఇబ్బంది కలుగుతున్నది. అయితే, ఈ మార్చి నెలకు సంబంధించి ఆయా రేషన్ షాపుల్లో నిల్వలు పోను 6,434 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరాల కావాల్సి ఉంది. కానీ గురువారం నాటికి జిల్లాలో 500 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా కావడం గమనార్హం. అంటే, ఇంకా 5,934 మెట్రిక్ టన్నులు సరఫరా కావాలి. గత నెలలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లలో స్టాక్ ఉన్న 359 మెట్రిక్ టన్నులు కొత్తగా వచ్చిన బియ్యం కలిపి కొన్ని రేషన్ షాపులకు మాత్రమే సరఫరా చేశారు. జిల్లాలోని ఎఫ్‌సీఐ గోడౌన్లలోగానీ, వేర్‌హౌజ్ గోడౌన్లలోగానీ బియ్యం నిల్వలు లేవు. దీంతో రేషన్ షాపులకు సరఫరా జరగలేదు. అయితే, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు మాత్రం మార్చి నెలకు సంబంధించిన 6,434 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని నల్లగొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి పంపిస్తామని ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఇంతవరకు గింజ కూడా జిల్లాకు రాలేదు.



### రేషన్ బియ్యం సక్రమంగా అందట్లేదు..



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రేషన్ బియ్యం సక్రమంగా అందడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి నెలా 1న బియ్యం పంపిణీ మొదలుపెట్టి 15 నాటికి పూర్తి చేసేవారు. ఇప్పటి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అలా ఇవ్వలేకపోతున్నది.

–నందిగామ గోవిందమ్మ, శ్రీనివాసనగర్, ఖమ్మం

### కేసీఆర్ ఉన్నప్పుడు 1నే వచ్చేవి..



సన్నబియ్యమిస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డి అనేక మాటలు చెప్పారు. ఇప్పుడు దొడ్డు బియ్యమే సమయానికి ఇవ్వడం లేదు. ఇక సన్నబియ్యం ఇస్తారా? కేసీఆర్ ఉన్నప్పుడే కచ్చితంగా 1వ తేదీన రేషన్ బియ్యం అందేవి.

–గుమ్మల ఉమారాణి, ప్రకాశ్‌నగర్, ఖమ్మం

### పది రోజుల్లో పంపిణీ పూర్తిచేస్తాం..



మార్చి నెల కేటాయింపు ఆలస్యమైంది. గత శనివారం నుంచి బియ్యం పంపిణీ ప్రారంభించాం. పది రోజుల్లోపు రేషన్ బియ్యాన్ని చౌక దుకాణాలకు సరఫరా చేస్తాం. ఆ వెంటనే కార్డుదారులకు పంపిణీ చేస్తాం. ఇందుకోసం గడువు పెంచుతాం.

–శ్రీలత, డీసీఎస్‌వో, ఖమ్మం

# పంటలెండిపోతున్నా.. పట్టింపేది?

ఎండిపోతున్న మొక్కజొన్న పంట



సాగునీరు అందక మాడిపోతున్న యాసంగి పంటలు

పైర్లు కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు శూన్యం

పంటల వైపు చూస్తూ గోడుమంటున్న 'భద్రాద్రి' రైతులు

ములకలపల్లి, మార్చి 6: 'నీళ్లు లేక పంటలెండిపోతున్నాయి.. సాగునీళ్లు అందించి మా పంటలను కాపాడండి మహాప్రభో..' అంటూ వేడుకుంటున్నారు భద్రాద్రి జిల్లాలోని చండ్రుగొండ, ములకలపల్లి మండలాల రైతులు. ఆరుగాలం శ్రమిస్తూ పంటలు సాగు చేస్తున్నామని, కేవలం సాగునీరు అందని కారణంగా తమ కళ్లముందే అవి మాడిపోతున్నాయి. పొలాలన్నీ నెర్రెలువారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైర్లను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు శూన్యమని వాపోతున్నారు. ఎండిపోతున్న పంటలవైపు దీనంగా చూస్తున్నారు. తలలు పట్టుకుంటూ గోడుమంటున్నారు.

భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం ములకలపల్లి, రాజుపేట, గొల్లగూడెం, భగత్‌సింగ్ నగర్, కంపగూడెం, చెవిటిగూడెం గ్రామాలకు చెందిన రైతులు ఇదే మండలంలోని పాములేరు వాగుపై ఆధారపడి ఏటా రెండు పంటలూ సాగు చేస్తుంటారు. కానీ.. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఆ వాగులో నీటి ప్రవాహం తగ్గింది. దీంతో అంతకుమునుపే వేసిన పంటలకు సాగునీరు అందడం లేదు. ఈ గ్రామాల్లో ప్రధాన యాసంగి పంటలుగా వరి, మొక్కజొన్న, శనగ సాగు చేస్తుంటారు. ఈ యాసంగిలోనూ సుమారు వెయ్యి ఎకరాల్లో రైతులు ఆయా పంటలు వేశారు. అవన్నీ ఇప్పుడు చేతికి వచ్చే దశలో ఉన్నాయి. కానీ.. ఇదే సమయంలో పాములేరు వాగులో నీళ్లు ఇంకిపోతున్నాయి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం తమ మొరను ఆలకించి తమ పంటలను కాపాడాలని వేడుకుంటున్నా పెద్దగా స్పందన కన్పించడం లేదు. దీంతో పాములేరు వాగుపై ఎగువన కమలాపురం వద్ద ఉన్న సీతారామ ప్రాజెక్టు కాల్వ అవుట్ గేట్‌ను తెరిచి పాములేరు వాగులోకి నీళ్లు వదిలి తమ పంటలకు నీళ్లు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

### వాగు నీళ్లొదిలి పంటలను కాపాడండి..



పాములేరు వాగులో గతంలో ఏడాది పొడవునా నీళ్లుండేవి. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే వాగు ఎండిపోయింది. మా పంటలకు ఆ వాగు నీరు ఆధారం. నీళ్లు లేక మా పంటలు ఎండిపోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని కమలాపురం వద్ద పాములేరు వాగుపై నిర్మించిన సీతారామ కాల్వ అవుట్ గేట్‌ను తెరిచి పాములేరులోకి నీళ్లు వదిలి మా పంటలకు అందించాలి.

–బైరు ప్రసాద్, రైతు, ములకలపల్లి

### 'సీతారామ' నీటిని మా పంటలకు కూడా ఇవ్వాలి..



మా గ్రామంలో నుంచి వెళ్తున్న సీతారామ ప్రాజెక్టు కాల్వ నీటిని మా పంటలకు కూడా మళ్లించండి. చెంతనుంచే సీతారామ ప్రాజెక్టు నీళ్లు వెళ్తున్నా మా పంటలకు అందడం లేదు. అందుకని ఆ నీళ్లు అందించైనా మా పంటలను కాపాడాలి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇవ్వకపోతే మాకు పెట్టుబడులు కూడా రావు. నష్టపోతాం.

–తాళ్ల వీరభద్రం, రైతు, భగత్‌సింగ్ నగర్, ములకలపల్లి మండలం

## అప్పు చేసి రూ.1.20 లక్షలు పెట్టుబడి పెట్టా..





*భద్రాద్రి జిల్లా చండ్రుగొండ మండలం దామరచర్ల గ్రామానికి చెందిన ఈ రైతు పేరు జిగురు రాఘవులు. ఇతడికున్న నాలుగు ఎకరాల మాగాణిలో రెండు నెలల క్రితం యాసంగి సీజన్ వరిని సాగు చేస్తున్నాడు. నెల రోజుల నుంచి కరెంటు కోతలు పెరిగాయి. ఈ క్రమంలో భూగర్భ జలాలు కూడా తగ్గాయి. దీంతో బోరుబావి నీరు రెండు ఎకరాలకే సరిపోతున్నది. దీంతో మిగతా పొలమంతా తన కళ్లెదుటే ఎండిపోతోందంటూ బోరుమంటున్నాడు. ఇప్పటి వరకు అప్పు చేసి మరీ రూ.1.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టానంటూ తన పొలంలోనే ఉండి పైరును చూస్తూ తల పట్టుకుంటున్నాడు.* –చండ్రుగొండ, మార్చి 6

# పకడ్బందీగా 'నవమి' ఏర్పాట్లు


### భద్రాచలంలో సమీక్ష సమావేశంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం, మార్చి 6 : వచ్చే నెలలో జరుగనున్న శ్రీరామ నవమి, మహా పట్టాభిషేకం మహోత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో రాహుల్, ఎస్పీ రోహిత్ రాజు, డీఆర్‌డీఏ విద్యాచందన, ఆలయ ఈవో రమాదేవిలతో కలిసి ఆయా శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముక్కోటి వేడుకలు ఎలా నిర్వహించారో అదే రీతిన విజయవంతం చేసేందుకు అధికారులు ప్రణాళికతో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. నవమికి ఇంకా నెల రోజుల సమయం ఉండడంతో తమకు అప్పగించిన పనులను శ్రద్ధగా పూర్తి చేయాలన్నారు. కల్యాణం వీక్షించే భక్తులకు ఇబ్బంది కలగకుండా బారికేడ్లు పెట్టి సెక్టార్లవారీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా 75 శాతం టికెట్లు కేటాయించాలని, 25 శాతం మ్యానువల్‌గా అందుబాటులో ఉంచాలని దేవస్థానం ఈవోకు సూచించారు. మహోత్సవాల నేపథ్యంలో పట్టణ పరిశుభ్రత కోసం సిబ్బందిని నియమించాలని, విధుల్లో ఉండే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని సూచించారు. భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు ఈ నెల 31లోగా పూర్తయ్యేలా చూడాలని, మిథిలా స్టేడియం పరిసరాల్లో మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. పార్కింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక వాహనాలు, ఎస్టీమ్ గిరీష్ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గోదావరి స్నానఘట్టాల వద్ద నాటు పడవలు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. భక్తుల రద్దీ నియంత్రణకు మూడంచెల భద్రత ఉండాలని, పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేలా 20 బెడ్లను సిద్ధంగా ఉంచుకోవాలని, 108 వాహనంతోపాటు సరిపడా మందులు, సీపీఆర్ చేసేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారుల సమక్షంలో కలెక్టర్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం, కొత్తగూడెం ఆర్డీవోలు దామోదర్‌రావు, మధుసూదన్, జిల్లా ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం, క్షీరాభిషేకం

'జై తెలంగాణ' నినాదాలతో హోరెత్తిన కాల్వ పరిసరాలు


చండ్రుగొండలో సీతారామ కాల్వ వద్ద కేసీఆర్ చిత్రపటానికి జలాభిషేకం చేస్తున్న రైతులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు

చండ్రుగొండ, మార్చి 6 : మాజీ సీఎం కేసీఆర్ దూర దృష్టితో తమ పంట భూములకు సీతారామ జలాలు వచ్చాయనే ఆనందంలో రైతులు బెండాలపాడు శివారు సీతారామ ప్రాజెక్టు కాల్వ వద్ద కేసీఆర్ చిత్రపటానికి గురువారం జలాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు కేసీఆర్ అని, జై తెలంగాణ, జైజై కేసీఆర్ అంటూ రైతులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో నినదించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల కోసం మాజీ సీఎం కేసీఆర్ సీతారామ ప్రాజెక్టు నిర్మాణం తలపెడితే.. నాటి ప్రతిపక్ష కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించిందని, కాల్వ నిర్మాణం జరగకుండా భూ సేకరణను సైతం అడ్డుకున్నదని ఆరోపించారు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు నిర్మాణం తమ గొప్పే అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, ఒక్క ట్రయల్ రన్ మాత్రమే వారు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు కొణకండ్ల వెంకటరెడ్డి, దారా బాబు, సంగొండి రాఘవులు, నరుకుళ్ల సత్యనారాయణ, నల్లమోతు వెంకటనారాయణ, భూపతి ధనలక్ష్మి, మేడా మోహన్‌రావు, సూర వెంకటేశ్వరరావు, కుంజా సావిత్రి, పూసం వెంకటేశ్వర్లు, పాండ్ల అంజన్‌రావు, సత్తి నాగేశ్వరరావు, భూపతి శ్రీనివాసరావు, కళ్లెం వెంకటేశ్వర్లు, చాపలమడుగు రామరాజు, సయ్యద్ బాద్‌షా, యాకూబ్, నరుకుళ్ల అప్పాజి, శ్రావణ్ పాల్గొన్నారు.

# సెకండియర్ పరీక్షలు షురూ..

### ఖమ్మం జిల్లాలో 407 మంది, భద్రాద్రి జిల్లాలో 271 మంది గైర్హాజరు



ఖమ్మం అర్బన్: నగరంలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో రవిబాబు

ఖమ్మం అర్బన్/కొత్తగూడెం గణేశ్ టెంపుల్, మార్చి 6 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గురువారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులు కేంద్రాల వద్దకు చేరుకోగా.. వారిని డీఐఈవో ఆదేశాల మేరకు సీఎస్, డీవోలు కేంద్రాల్లోకి అనుమతించారు. ఖమ్మం జిల్లాలోని 72 కేంద్రాలకు సీఎస్, డీవోలు కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశ్నాపత్రాలను తరలించారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ల నుంచి ఎస్కార్టు సిబ్బంది సహాయంతో కేంద్రాలకు తరలించారు. గురువారం జరిగిన పరీక్షలో 'ఏ' సెట్ ప్రశ్నాపత్రాన్ని అందజేశారు. వేసవి ఎండల దృష్ట్యా ముందస్తుగా మెడికల్ కిట్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పరీక్షా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

### 407 మంది గైర్హాజరు..

గురువారం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఐఈవో రవిబాబు తెలిపారు. జనరల్ విభాగంలో 15,190 మంది విద్యార్థులకు.. 14,867 మంది హాజరైనట్లు డీఐఈవో పేర్కొన్నారు. ఒకేషనల్ విభాగంలో 2,072 మంది విద్యార్థులకు.. 1,988 మంది హాజరుకాగా.. మొత్తం 407 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, హైపవర్ కమిటీ సభ్యుల బృందం జిల్లాలోని 42 కేంద్రాలను తనిఖీ చేశారు.

### భద్రాద్రి జిల్లాలో 271 మంది గైర్హాజరు

భద్రాద్రి జిల్లాలోని 36 కేంద్రాల్లో ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసే విద్యార్థులను ఉదయం 8 గంటల నుంచే తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ఐదు నిమిషాలు సడలింపు ఇవ్వడంతో విద్యార్థులంతా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. జనరల్ విభాగంలో 7,212 మంది విద్యార్థులకు.. 7,096 మంది పరీక్ష రాయగా.. 116 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,818 మంది విద్యార్థులకు.. 1,663 మంది హాజరుకాగా.. 155 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు తెలిపారు. ఎక్కడా ఎలాంటి మాస్ కాపీ జరగలేదని పేర్కొన్నారు.


కొత్తగూడెం గణేష్ టెంపుల్: పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు

# పెండింగ్ ఖాతాలు క్లియర్ చేయండి

### ఐటీడీఏ పీవో రాహుల్


బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, మార్చి 6: ట్రైకార్, ఎంఎస్ఎంఈ యూనిట్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల ఖాతాలను త్వరితగతిన క్లియర్ చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఐటీడీఏలోని తన చాంబర్‌లో యూనిట్ అధికారులు, బ్యాంకర్లతో ట్రైకార్, ఎంఎస్ఎంఈ యూనిట్లతో గిరిజన నిరుద్యోగులకు జీవనోపాధి పెంపొందించడానికి సబ్సిడీ ద్వారా మంజూరు చేసిన రుణాలు లబ్ధిదారులకు అందేలా బ్యాంకర్లు తీసుకోవాల్సిన కార్యాచరణపై గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020–21, 2021–22లో ట్రైకార్‌కు సంబంధించి యూనిట్లు లాగిన్ అయి గ్రౌండింగ్ చేసిన 70 యూనిట్లను మార్చి 31 నాటికి పూర్తి చేసి లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. అర్హులైన లబ్ధిదారులను బ్యాంకర్లు ఇబ్బంది పెట్టవద్దని, వీలైనంత త్వరగా వాటిని క్లియర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, ఏడీ అగ్రికల్చర్ భాస్కరన్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, జేడీఎం హరికృష్ణ, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.